సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024

ప్రత్యేక అలంకరణలో లలితాంబిక



నబ్బవరం: దేవీపురం లోని సహస్రాక్షి రాజ రాజేశ్వరీదేవి ఆరా ధన పీఠంలో అమ్మ వారు స్వయంవర కల్యాణి అలంకర ణలో దర్శనమిచ్చారు.



తంతడిలో భారీ తిమింగలం

అచ్యుతాపురం మండలం తంతడి శివారు వాడపాలెం తీరానికి శనివారం 18 అడుగుల పొడవు ఉన్న తిమింగలం కొట్టుకొచ్చింది.



ఘనంగా తులసీదళార్చన

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

సీఎం జగన్‌పై దాడి అమానుషం

- కుట్ర కోణంలో విచారణ జరపాలి
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: విజయవాడ సింగి నగర్‌లో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు రాయితో దాడి చేయడం అమానుషమని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఖండించారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఈ దాడి ఘటనపై పోలీసులు కుట్ర కోణంలో విచారణ జరపాలని ఆయన కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, దీనిని ఓర్వలేకనే కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. నిందితులను గుర్తించి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

11 మంది వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలను చూపిస్తున్న గ్రామ వలంటీర్లు

అడ్డతీగల: మండలంలోని దుశ్శర్తి పంచాయతీకి చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. గ్రామవలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కుప్పాల జోగేశ్వరి, కానెం విజయబాబు, పాగి లీలావతి, రెడ్డిప్రోలు సత్యవేణి, జనుమూరి దేవి, పురోది భవాని, సంకోజీ రామలక్ష్మి, కెచ్చెల వరలక్ష్మి, సరుబోలు లక్ష్మణరావు, జనుమూరి శ్రీహరి, పుట్టపల్లి శిరీష తమ రాజీనామా పత్రాలను గ్రామసచివాలయంలో అందజేశారు. సామాజిక సేవా దృక్పథంతో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న తమపై ఇష్టానుసారంగా విమర్శలు చేయడం తగదన్నారు.

గిరిజన గ్రామాల్లో ప్రతీ ఇంటికీ విద్యుత్ సౌకర్యం

- ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్



రాళ్లగడ్డలో విద్యుత్ కనెక్షన్లను పరిశీలిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్

చింతపల్లి రూరల్: గిరిజన గ్రామాల్లో ప్రతీ ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్ తెలిపారు. మండలంలో రాళ్లగెడ్డ ,గూడెం కొత్తవీధి మండలంలో మర్రిపాలెం, పనసగొంది గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇప్పటివరకు ఏర్పాటుచేసిన విద్యుత్ కనెక్షన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకంలో ఇప్పటి వరకు రెండు మండలాలకు సంబంధించి 2,123 మంది పీవీటీజీలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు అమర్చి కనెక్షన్లు ఇచ్చామన్నారు. నాన్ పీవీటీజీలకు సంబంధించి 250 వరకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. సుమారు 300కు పైగా విద్యుత్ స్తంభాలు, అదనంగా 14 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ వనుము ప్రభాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



చింతపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

చింతపల్లి రూరల్: ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు ముమ్మరంగా చేశారు. దీనిలో భాగంగా శనివారం స్థానిక ఏపీఆర్ కళాశాల వద్ద తనిఖీలు చేపట్టారు. మైదాన ప్రాంతాల నుంచి వస్తున్న, వెళ్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెడుతున్నారు.

తెలుగుదేశానికి తుడుం దెబ్బ!



- అల్లూరి జిల్లాలో తుడిచి పెట్టేస్తామని గిరిజనుల హెచ్చరికలు
- తామంటే అంత అలుసా అని మండిపాటు
- నమ్మించి మోసం చేశారని ఆవేదన
- పోటీలో నిలవనున్న గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర, అబ్రహం
- అదే దారిలో రాజేశ్వరి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీకి గిరిజన అభ్యర్థుల నుంచి గట్టి దెబ్బ తగలనుంది. అల్లూరి జిల్లాలో పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో రెబల్ అభ్యర్థులు బరిలో నిలవనున్నారు. ఇప్పటికే పాడేరు నుంచి గిడ్డి ఈశ్వరి, అరకు నుంచి దొన్నుదొర, అబ్రహంలు పోటీలో ఉంటామని ప్రకటించారు. అదే దారిలో రంపచోడవరం నియోజకవర్గం నుంచి వంతల రాజేశ్వరి కూడా రెబల్ అభ్యర్థిగా బరిలో దిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గిరిజనులను మోసం చేసిన తెలుగుదేశం పార్టీని అల్లూరి జిల్లాలో తుడిచి పెట్టేస్తామని హెచ్చరిస్తున్నారు. గిరిజనులంటే చిన్న చూపు ఉన్న తెలుగుదేశం పార్టీకి తమ సత్తా చాటుతామని.. నిన్ను నమ్మం బాబూ అంటూ ఎక్కడికక్కడ తీర్మానాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో అల్లూరి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ ఓటమిని చవిచూసింది. ఎంపీ ఎన్నికల్లో కూడా నామరూపాలు లేకుండా పోయింది. వచ్చే ఎన్నికల్లో మరింత గట్టిగా తెలుగుదేశం పార్టీకి తుడుం దెబ్బ రుచి చూపిస్తామని గిరిజనులు ఘంటాపథంగా హెచ్చరిస్తున్నారు.

పార్టీలు మారినా ఫాయిదా లేదు..!

వాస్తవానికి 2014 ఎన్నికల్లో పాడేరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి ఈశ్వరి.. చంద్రబాబు వలలో చిక్కుకుని వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారు. ఇక అరకు నుంచి గెలిచిన కిడారి సర్వేశ్వరరావు కూడా చంద్రబాబు మాటల మాయలో పడి పార్టీ మారారు. రంపచోడవరం ఎమ్మెల్యే రాజేశ్వరి కూడా అదే దారిలో వెళ్లారు. అయితే, ఈ దఫా ఎన్నికల్లో వీరిలో ఇద్దరికీ పక్కా సీటు అని చంద్రబాబు నమ్మించారు. పాడేరు నుంచి గిడ్డి ఈశ్వరి పక్కాగా పోటీలో ఉంటానని నమ్మారు. ఇక రంపచోడవరం నుంచి రాజేశ్వరి కూడా తనకు ఎదురులేదని భావించారు. పార్టీ మారి వచ్చిన తమకు గౌరవం దక్కుతుందని ఊహించుకున్నారు. అరకు నుంచి దొన్నుదొరను అభ్యర్థిగా కూడా బహిరంగ సభ పెట్టి మరీ బాబు ప్రకటించారు. అయితే, తీరా ఎన్నికలు వచ్చే సమయానికి అరకు సీటును బీజేపీకి కేటాయించిన చంద్రబాబు.. మిగిలిన రెండు సీట్లలో కూడా తనను నమ్మి పార్టీ మారి వచ్చిన వారికి మొండిచేయి చూపారు. తమకు విలువ లేకుండా పోయిందని వారంతా మరింత కోపంతో రగిలిపోతున్నారు. నమ్మించి మోసం చేసిన బాబుకు తమ సత్తా చాటుతామని హెచ్చరిస్తున్నారు.

నామరూపాలు లేకుండా చేస్తాం...!

అల్లూరి జిల్లాలో గత ఎన్నికల్లో ఒక్క సీటునూ టీడీపీ దక్కించుకోలేదు. అరకు ఎంపీతో పాటు పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాలన్నింటిలోనూ ఓటమి చవిచూసింది. ఈ దఫా ఎన్నికల్లో ఎక్కడో ఒక్క సీటులోనైనా బోణీ చేయాలని భావించిన టీడీపీ అరకు నుంచి ముందుగానే దొన్నుదొరకు సీటు ఇస్తున్నట్టు ప్రకటించింది. దొన్నుదొరకు సీటు ఇవ్వడాన్ని వ్యతిరేకించిన ఆ పార్టీ మరో నేత అబ్రహం రెబల్‌గా బరిలో ఉంటానని ప్రకటించారు. అయితే, తీరా షెడ్యూల్ వచ్చిన తర్వాత ఆ సీటును కూడా బీజేపీకి కేటాయించారు. ఈ నేపథ్యంలో అరకు నుంచి అటు అబ్రహంకు తోడు దొన్నుదొర కూడా చంద్రబాబు వ్యవహారశైలిపై మండిపడుతూ బరిలో ఉండనున్నట్టు ప్రకటించారు. నమ్మించి మోసం చేసిన చంద్రబాబును ఏజెన్సీ ప్రాంతాల్లో నామరూపాలు లేకుండా చేస్తామని గిడ్డి ఈశ్వరి శపథం చేస్తున్నారు. మరోవైపు సీటు కోల్పోయి కన్నీరు పెట్టుకున్న రంపచోడవరం నియోజకవర్గం నుంచి రాజేశ్వరి కూడా తమ సత్తా చూపి ఏజెన్సీల్లో సైకిల్ పార్టీకి సీటు లేకుండా చేస్తామని పేర్కొంటున్నారు. మొత్తంగా అల్లూరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి రెబల్ అభ్యర్థుల బెడద వెంటాడుతోంది.

గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ



సీదరి శ్రీనివాస్



కమల్ భార్గవ్

పాడేరు : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో ఇద్దరు గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని వేపగుంటలో 21వ సెంచరీ ఎడ్యుకేషన్ సంస్థ గిరిజన విద్యార్థులకు శిక్షణ అందిస్తోంది. ఇక్కడ శిక్షణ పొందిన పాడేరు మండలం గబ్బంగి పంచాయతీ దేవరాపల్లి గ్రామానికి చెందిన సీదరి శ్రీనివాస్, విశాఖ నగరంలో ఉంటున్న గుజ్జెలి కమల్ భార్గవ్ గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో సత్తా చాటారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో వి.అభిషేక్, 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కె.ధరణి అభినందనలు తెలిపారు. కాగా ఈ వీరిద్దరూ ఇటీవల ఎస్ఐ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

నేడు పార్కుల్లో పక్షులకు ఆహారం, నీరు అందజేత

అనకాపల్లి : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్కుల్లో ఆదివారం ఉదయం 8 గంటలకు పక్షులకు వరి కంకులు, మట్టి పాత్రల్లో నీరు, గూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరించిపోతున్న పక్షి జాతులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఊరూవాడ ఫ్యాన్ ప్రభంజనం

- మరోసారి జగనన్నే సీఎం
- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం



వణకరాయిలో ఎన్నికల ప్రచారంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ఎమ్మెల్యే ధనలక్ష్మికి పూలమాల వేసి బొట్టు పెడుతున్న గిరిజన మహిళలు

రాజవొమ్మంగి: ఊరూవాడ ఫ్యాన్ ప్రభంజనం వీస్తోందని..జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చూడబోతున్నామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మండలంలోని శరభవరం, శరభవరం కాలనీ, వణకరాయి, దాకరాయి, కొండపల్లి, మర్రిపాలెం, బడదనాంపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనతోపాటు అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె ఘన స్వాగతం లభించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ కోవిడ్ వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ సంక్షేమ పథకాలతోపాటు సుపరిపాలన అందించారన్నారు. ఎన్నికల వేళ అమలుకాని హామీలతో కూటమి అభ్యర్థులు వస్తున్నారని, వారిని ఏ ఒక్కరూ నమ్మొద్దని సూచించారు. ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా వివిధ పథకాలకు చెందిన సంక్షేమ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలే జమ చేశారన్నారు. గిరిజనల పట్ల ప్రత్యేక అభిమానం చూపిస్తున్న జగనన్నను మరోసారి సీఎంను చేసేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, ఎంపీటీసీ చుండ్రు లోవకుమారి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, మిరియాల గణలక్ష్మి, దాసరి నాగేశ్వరావు, నాయకులు చింతలపూడి వెంకటరమణ, జాన్‌బాబు, కనిగిరి దుర్గాప్రసాద్, మునలయ్య, సత్యన్నారాయణ, కామేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు

- ప్రతి అంశంపైన అవగాహన తప్పనిసరి
- కలెక్టర్ విజయ సునీత



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: ఎన్నికల కోడ్ నిబంధనలను సక్రమంగా అమలుజేయాలని..ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎం.విజయసునీత హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కొయ్యూరు, జీకేవీధి, అరకులోయ మండలాల పీవోలు, ఏపీవోలకు స్థానిక గురుకుల విద్యాలయంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు అప్పగించిన విధులను ప్రతిఒక్కరు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి అంశంపైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈవీఎంలు, వీవీ ప్యాడ్ల వినియోగం,మాక్ పోలింగ్,టెండర్ ఓటింగ్, ఛాలెంజ్ ఓటు, ఇతర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు జేస్తున్నామని, ఈ విషయంలో పీవోల బాధ్యత కీలకమన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సహకరించాలని ఆమె కోరారు. ఓటింగ్ శాతాన్ని 75నుంచి 80శాతం వరకు పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈకార్యక్రమంలో ఎస్‌డీసీ వీవీఎస్.శర్మ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఓపెన్ స్కూల్ పరీక్ష పేపర్ల మూల్యాంకనం శనివారం ప్రారంభమైంది. వివిధ జిల్లాల పరిధిలోని అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించి 22,125 జవాబు పత్రాలను 226 మంది ఉపాధ్యాయులు గ్రూపులుగా ఏర్పడి మూల్యాంకనం చేస్తున్నారు. డీఈవో పి.బ్రహ్మాజీరావు, ఏసీజీఈ శశికుమార్, ఏడీ వినయ్‌కుమార్ పరిశీలించారు.

నిర్భయంగా ఓటేసేలా ఏర్పాట్లు

- 50 నాటు తుపాకులు స్వాధీనం
- ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కేసులు
- 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు
- రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి



రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అన్నారు. తన కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే గ్రామాల్లో నాటు తుపాకులు కలిగి ఉంటే సమీప పోలీసుస్టేషన్లలో అప్పగించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. తమ డివిజన్ పరిధిలో 50 నాటు తుపాకులను స్వచ్ఛందంగా అప్పగించారన్నారు. ఇప్పటికీ కలిగి ఉంటే స్వచ్ఛందంగా అందజేయాలని, తాము స్వాధీనం చేసుకుంటే చట్ట ప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. తప్పనిసరిగా పదేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పటిష్ట భద్రత మధ్య ఎన్నికలను సజావుగా నిర్వహిస్తామన్నారు. సారా, గంజాయి, ఎన్నికల తగాదాల్లో ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నట్టు తెలిపారు.ఎన్నికలు పురస్కరించుకుని రాష్ట్ర సరిహద్దు చింతూరు, జిల్లా సరిహద్దు పోక్సుపేటలో పోలీస్ తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ స్టేషన్ పరిధిలో ఎస్ఐలు, సీఐలు ఎన్నికలు, ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గుర్తేడు వంటి లోతట్టు ప్రాంతంలో పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలను రంపచోడవరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు హెలికాప్టర్ వినియోగిస్తున్నట్టు చెప్పారు. రంపచోడవరంలోనే లెక్కింపు నిర్వహించేందుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అనుమతి రావాల్సి ఉందన్నారు. మావొయిస్టుల బంద్ నేపథ్యంలో రాజకీయ నేతలు, పోటీ చేసే అభ్యర్థులకు లోతట్టు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారానికి అనుమతి ఇవ్వలేదని ఏఎస్పీ తెలిపారు.

చిక్కడు..దొరకడు

- స్థానికుడైనా అనకాపల్లి ప్రజలకు ఎప్పుడూ దూరమే
- కార్యకర్తలకు అందుబాటులో ఉండని నేతగా గుర్తింపు
- కొణతాలకు సీటు కేటాయింపుపై టీడీపీ, జనసేన కేడర్‌లో అసంతృప్తి

సాక్షి, అనకాపల్లి: కొణతాల రామకృష్ణ.. ఒకప్పుడు రాష్ట్ర స్థాయి నేతగా గుర్తింపు పొందారు. అనకాపల్లి నుంచి గెలిచి నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారు. రాష్ట్ర మంత్రిగా వెలగబెట్టినా ప్రజలనే కాదు.. కనీసం కార్యకర్తలను కూడా పట్టించుకోరని పేరు. ప్రతి చిన్న విషయానికి పార్టీ అధినాయకత్వంపై అలగడం.. కొన్ని వారాలు, నెలల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం.. సహచర నాయకులు వెళ్లి బుజ్జగించడం.. అప్పట్లో అది నిత్యకృత్యం. 2014లో ఓటమి చవిచూశాక అయిదేళ్ల పాటు బయట కనిపించలేదు. మళ్లీ 2019 ఎన్నికల సమయానికి బయటకు వచ్చి హడావుడి చేయాలని ప్రయత్నించారు. ఈసారి ఏ ఒక్క పార్టీ ఈ నేతను పట్టించుకోలేదు. దీంతో ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చింది. మళ్లీ ఎన్నికలు వచ్చాయి. పాత పార్టీలు పట్టించుకోవని ముందుగానే గ్రహించిన కొణతాల.. ఈసారి ఎటువంటి దశ దిశ లేని జనసేన వైపు అడుగులు వేశారు. రాష్ట్ర స్థాయి నేత అనే భ్రమలో ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా వెంటనే జనసేన కండువా కప్పేశారు. అలా చేరారో లేదో.. యథావిధిగా కొద్ది రోజులకే అలక బూనారు. టికెట్‌పై స్పష్టత ఇవ్వలేదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు విశాఖ పర్యటనకు వస్తున్నా కలవనని చెప్పి ఇంట్లో కూర్చున్నారు. దీంతో నాగబాబు అతని ఇంటికి వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఆ వెనుకే పవన్ కల్యాణ్ కూడా కొణతాల ఇంటికి వెళ్లి అనకాపల్లి టికెట్‌కు హామీ ఇచ్చేశారు.

ఉత్తరాంధ్ర ప్రయోజనాలు తాకట్టు : ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తానని కొణతాల ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి ప్రారంభించారు. ఇప్పుడు ఎన్నికల్లో టికెట్ కోసం ఈ ప్రాంత ప్రయోజనాలను తాకట్టు పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటిస్తే.. న్యాయస్థానాల్లో కేసులు వేయించి అడ్డుకున్న టీడీపీ అధినేత చంద్రబాబుతో ప్రస్తుతం ఆయన చేతులు కలుపుతున్నారు. విశాఖ వద్దు.. అమరావతే ముద్దు అంటున్న జనసేన పార్టీలో చేరి, టికెట్ సంపాదించారు. ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితిని పాడె ఎక్కించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు బీజం వేసిన బీజేపీతో జతకట్టి కూటమిలో చేరారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయకుండా నీరుగారుస్తున్న ఆ పార్టీతో నిస్సిగ్గుగా చేతులు కలిపారు. రాజకీయంగా భూస్థాపితం కావడం వల్లే చంద్రబాబు వద్ద కొణతాల ఉత్తరాంధ్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారని ఈ ప్రాంత ప్రజా నాయకులు, మేధావులు విమర్శిస్తున్నారు.

అనకాపల్లికి ఏం చేశారు? : సుదీర్ఘకాలం పాటు రాజకీయాల్లో వివిధ పదవులు నిర్వహించినప్పటికీ సొంత నియోజకవర్గ ప్రజల కోసం కొణతాల చేసిందేమీ లేదన్న విమర్శలున్నాయి.. ప్రజలే కాదు సామాన్య కార్యకర్తలు సైతం ఆయన్ను కలవాలంటే చాలా కష్టమే. తన ప్రాంత ప్రయోజనాల కోసం తాడోపేడో తేల్చుకుందామన్నంత కమిట్‌మెంట్ ఆయనలో ఎప్పుడూ కనిపించదు. అందుకే రాజకీయాల్లో అంత సీనియర్ అయినప్పటికీ తనకంటూ ముద్ర వేసుకోలేకపోయారు.

కొణతాల కోసం జనసేన కనుమరుగు

కొణతాల పుణ్యమాని జనసేన నాయకుడు పరుచూరి భాస్కరరావు వర్గీయులు బీజేపీలో చేరారు. ఇప్పటికీ కూటమి నుంచి పీలా గోవింద, పరుచూరి, దాడి వీరభద్రరావులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వచ్చారు. అధిష్టానం ఆదేశాల మేరకు కొణతాలకు మద్దతు ఇస్తామని చెప్పినప్పటికీ.. అందుకు వారికి మనస్కరించడం లేదు. తాజాగా పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు సైతం దాడి, ఆయన తనయుడు డుమ్మాకొట్టారు. చివరకు కొణతాల కోసం జిల్లాలో జనసేన కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

మన్యం గూటికి పండగొచ్చింది

- వాడవాడలా ఇటుకల పండగ
- పంటలు పండాలని పూజలు
- వేటాడకపోతే పేడ నీళ్లతో స్నానం
- వింత ఆచారం..వారి సంప్రదాయం



శంకులమ్మతల్లికి పూజ చేస్తున్న గిరిజనుడు



కించుమండ సమీపంలో రోడ్డుకు అడ్డంగా నిల్చుని చందాలు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లాలో గిరిజనులు ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా ఇటుకల పండగ నిర్వహణ విభిన్నంగా ఉంటుంది. ఏటా కొత్తఅమావాస్య, ఉగాది తరువాత ఈ పండగను జరుపుకోవడం ఆనవాయితీ. ఏజెన్సీలో నెలరోజులపాటు పండగ సందడి ఉంటుంది. ఖరీఫ్, రబీలో పంటలు బాగా పండాలని విత్తనాలకు గిరిజనులు పూజలు చేస్తుంటారు. పశుసంపద వృద్ధి చెందాలని శంకులమ్మ తల్లిని ఆరాధిస్తారు. డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో పండగకు గిరిజనులు శ్రీకారం చుట్టారు. డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో సందడి చేస్తున్నారు. గిరిజన మహిళలు రోడ్డుకు తాడును అడ్డంగా పెట్టి నిలబడి వాహనదారుల నుంచి చందాలు (తాసేరు) వసూలు చేపట్టారు. పాటలు పాడుతూ..వారిపై రంగు నీళ్లు చల్లుతూ ఉత్సాహంగా గడుపుతున్నారు. హుకుంపేట మండలం ఉక్కురబలో ఆయుధాలకు పూజలు చేసిన అనంతరం సంప్రదాయ విల్లంబులు, ఈటెలు, గొడ్డళ్లు, గునపాలు పట్టుకుని పురుషులు సమీప అటవీ ప్రాంతంలో జంతువుల వేటకు బయలుదేరారు. వీరికి మహిళలు నుదుటన తిలకం దిద్ది ఆశీర్వదించి పంపించారు. తీసుకువచ్చిన జంతువు మాంసంతో విందు ఏర్పాటుచేసుకుంటామని గిరిజనులు తెలిపారు. జంతువు లేదా పక్షిని వేటాడి తీసుకురాకుంటే పేడ నీళ్లతో స్నానం చేయిస్తామని.. తీసుకువస్తే ఊరంతా జాతరలా ఉంటుందని వారు పేర్కొన్నారు.



ఇటుకల పండగ సందర్భంగా థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



ఆయుధాలతో వేటకు బయలుదేరిన యువత

క్లుప్తంగా

రమణ @ 973


రమణ

తుమ్మపాల: పట్టుదలతో పైకి రావాలనే తపన ఉంటే అవరోధాలు ఎన్నయినా అధిగమించవచ్చని నిరూపించాడు ఇంటర్ విద్యార్థి భర్నికాన రమణ. ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఎంపీసీలో 973/1000 మార్కులు సాధించి, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. బుచ్చెయ్యపేట మండలం ఆర్.శివరాంపురం గ్రామానికి చెందిన భర్నికాన రమణకు తల్లిదండ్రులు లేరు. దీంతో గవరపాలెం బీసీ బాయ్స్ హాస్టల్లో ఉంటూ ఏఎంఏఎల్ కళాశాలలో విద్య నభ్యసిస్తున్నాడు. రమణ చదువుకు హోమియో వైద్యులు డాక్టర్ బి. శశిధర్ అందిస్తున్నారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రమణ ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించాడు. ఆయన రమణను అభినందించారు. రమణ ఉన్నత చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఏఎంఏఎల్ కళాశాల యాజమాన్యం రమణను అభినందించింది.

ఆందోళనకు ఇది సరైన సమయం కాదు

మహారాణిపేట: గంగవరం పోర్టు కార్మికుల సమస్యలపై కలెక్టర్ ఎ.మల్లికార్జున శనివారం.. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్మిక సంఘాలతో చర్చించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండడం వల్ల ఆందోళనకు ఇది సరైన సమయం కాదని కార్మిక సంఘాలకు సూచించారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని, వారు కొంత సమయం కోరారని వారికి వివరించారు. అంతవరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్, డీసీపీ(శాంతి భద్రతలు) సత్తిబాబు, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజా సంక్షేమం

ఎమ్మెల్సీ అనంతబాబు


నెల్లిపూడి గ్రామంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

గంగవరం: ముఖ్యమంత్రి జగనన్నతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని, పార్టీలకతీతంగా ప్రతి గడపకు అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే సాధ్యమైందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) అన్నారు.

మండలంలోని నెల్లిపూడి, పిడతమామిడి, మొల్లేరు పంచాయతీల్లో ఎనిమిది గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణిలకు మద్దతుగా ఎమ్మెల్సీ అనంతబాబు శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి పేదల తలరాతలు మార్చి జనం గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ధనలక్ష్మి, తనూజరాణిలకు ఫ్యాను గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు.

జగనన్న నవరత్నాలు పథకాలు ద్వారా ప్రతీ ఇంట సంతోషం వెల్లివిరిస్తోందన్నారు. సామాజిక భద్రత పింఛన్లకు సుమారు రూ.65 కోట్లను అందజేసినట్టు చెప్పారు. రైతు భరోసా ద్వారా 419 రైతులకు రూ. 15 కోట్లు అమ్మఒడి పథకం ద్వారా 3,500 మందికి రూ.15 కోట్లు, జగనన్న విద్య దీవెన ద్వారా 554 మంది విద్యార్థులకు రూ.60 లక్షలు, జగనన్న వసతి దీవెన ద్వారా 225 మంది విద్యార్థులకు రూ.25 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు.. అ వైయస్సార్ చేయూత ద్వారా 1923 మందికి రూ. 12 కోట్లు, వైయస్సార్ ఆసరా ద్వారా 3210 మందికి రూ.4.12కోట్లు, కొండపోడు సాగు చేసే 1123 మందికి 2080 ఎకరాల్లో పట్టాలు అంజేసినట్టు చెప్పారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలకు కలిపి సుమారు సంక్షేమ పథకాల రూపంలో రూ.135 కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గంగవరంలో రూ.1.50కోట్లతో పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం, పిడతమామిడిలో రూ.38లక్షలతో పీహెచ్‌సీలో మరమ్మతు పనులు చేసినట్టు చెప్పారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి పనుల నిమిత్తం నెల్లిపూడి సచివాలయం పరిధిలో రూ. 14కోట్లు, పిడతమామిడి సచివాలయం పరిధిలో రూ 17.95కోట్లు, మొల్లేరు సచివాలయం పరిధిలో 25.90కోట్లు మంజూరైనట్టు చెప్పారు. పాతరామవరం బ్రిడ్జి నుండి భారీ ర్యాలీగా అనంతబాబు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయనకు స్థానికులు స్వాగతం పలికారు, పార్టీ శ్రేణులు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు.

భారీగా టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లిపూడి పంచాయతీలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నంపాలెం గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన 25 మంది నాయకులు, మెల్లేరు పంచాయతీ వడ్డిచెరువు గ్రామానికి చెందిన 25 కుటుంబాలు ఎమ్మెల్సీ అనంతబాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల విసుగెత్తిపోయామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని, టీడీపీ, పొత్తు పార్టీలకు గుణపాఠం చెబుతామన్నారు.

ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మావతి, కో-ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ సిద్ధార్థ దొర, సర్పంచులు శివ, రామలక్ష్మి, రమణమ్మ, మరిడమ్మ, కుంజం లక్ష్మి, కామరాజుదొర, పార్వతి, మండల పార్టీ కన్వీనర్ అప్పలరాజు, సిహెచ్.రఘునాథ్, మండల జేసీఎస్ కన్వీనర్ మాగంటి శ్రీను, నాయకులు కొండారావు, కుమార్, ఏసు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో నిలిచిన లారీ: ట్రాఫిక్‌కు అంతరాయం


ఘాట్‌రోడ్డులోని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన కర్రల లోడుతో ఉన్న లారీ

అనంతగిరి: మండలంలోని ఘాట్‌రోడ్డులోని శనివారం సాయింత్రం మలుపువద్ద రోడ్డుకు అడ్డంగా కర్రల లారీ నిలిచిపోవడంతో ఆరగంట పాటుగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అరకు వైపు నుంచి కర్రల లోడుతో వెళ్తున్న లారీ హెయిర్ పిన్‌బెండ్-3 మలుపు వద్దకు వచ్చేసరికి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కార్లు, ద్విచక్రవాహనాలకు వెళ్లేందుకు అవకాశం ఉండడంతో రాకపోలకు సాగించాయి. పెద్ద వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో బస్సుల్లో ప్రయాణికులు కొంతసేపు ఇబ్బంది పడ్డారు. డ్రైవర్ చాక్యచక్యంగా వ్యవహరించి, లారీని ముందుకు నడపడంతో యథావిధిగా వాహన రాకపోకలు సాగాయి.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడ సేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



వేటకు విరామం

- నేటి అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం
- 61 రోజుల పాటు అమలు
- సంప్రదాయ తెప్పలు, పడవలకు మినహాయింపు


హార్బర్‌లో బోట్లు

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు చేపల వేటపై నిషేధం అమలులో ఉంటుంది. వేట విరామంతో 90 శాతం బోట్లు తీరానికి చేరుకున్నాయి. మిగిలిన 10 శాతం బోట్లు ఆదివారం సాయంత్రానికి చేరుకుంటాయని మత్స్యకారులు తెలిపారు. 61 రోజుల్లో సముద్రంలో మత్స్య సంతతి వృద్ధి, సంతాన ఉత్పత్తికి వీలుగా ప్రభుత్వం ఎన్నో ఏళ్ల నుంచి ఈ విరామాన్ని అమలు చేస్తోంది. సముద్రంలో చేపల వేట సాగించే మరబోట్లు, వెసల్స్, ట్రాలర్ల వల్ల మత్స్య సంపదకు హాని కలుగుతుందన్న ఉద్దేశంతో వీటితో వేటను నిషేధించింది. అయితే మోటార్లు లేని సంప్రదాయ తెప్పలు, నాటు పడవలకు మినహాయింపునిచ్చింది. నిషేధ సమయంలో తెప్పలు/పడవలు సముద్ర తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు చేపల వేటకు అనుమతిస్తారు.

విశాఖ జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. 32 మత్స్యకార గ్రామాలు, 15 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 51 వేల మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. 10 వేల మందికిపైగా మత్స్యకారులు సముద్రంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. హార్బర్‌పై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికిపైగా జీవిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా 1,674 బోట్లు, భీమిలి కేంద్రంగా 294 బోట్లపై వేట చేస్తున్నారు. ఇవి కాకుండా 443 సంప్రదాయ తెప్పలు, పడవలు ఉన్నాయి. సంప్రదాయ తెప్పలు, పడవలు తప్పించి.. అన్ని మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకు ఈ నిషేధ చట్టం వర్తిస్తుంది. నిషేధ కాలంలో మత్స్యవేట చేస్తే ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం సెక్షన్(4)ను అనుసరించి శిక్షార్హులు. వారి బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకోవడంతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ ఆయిల్ రాయితీ, అన్ని రకాల సౌకర్యాలు నిలుపుదల చేస్తామని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణ హెచ్చరించారు.

విరామ సమయంలో ఇలా..

చేపలవేట విరామ సమయంలో బోటు యజమానులు తమ బోట్లకు మరమ్మతులు చేయించుకుంటారు. ఇంజిన్ గేర్ బాక్సులు, ఆయిల్, వాటర్, కేబిన్, పంఖాలు, బుష్లు వంటి వాటికి రిపేర్లు చేయించుకుని బోటు కండిషన్‌లో ఉంచుకుంటారు. అలాగే వలలకు కూడా మరమ్మతు పనులు చేపడతారు. బోట్లలో వేట కెళ్లే మత్స్యకార సిబ్బంది (క్రూ) స్థానికంగా లభించే పనులకు వెళ్తారు.

ఐదేళ్లలో రూ.61 కోట్ల భరోసా

- టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట విరామ సమయంలో రూ.4 వేల చొప్పున ఇచ్చే నిషేధ భృతిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే రూ.10 వేలకు పెంచింది.
- జిల్లా మత్స్యకారులకు టీడీపీ తన ఐదేళ్ల పాలనలో రూ.20 కోట్ల భృతిని అందిస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.61.02 కోట్లను మత్స్యకార భరోసా కింద అందజేసింది.
- టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు వేట నిషేధ సమయంలో ఇచ్చే అరకొర పరిహారాన్ని ఏడాదికో, రెండేళ్లకో ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ మొత్తాన్ని నిషేధ కాలం ముగియకుండానే ఏటా మేలోనే వారి ఖాతాలకు నేరుగా జమ చేసి మత్స్యకారులకు అండగా నిలిచింది.
- 2019 వరకు కేవలం 318 మందికే డీజిల్ సబ్సిడీ వర్తింపజేయగా.. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ సంఖ్య 550కి పెరిగింది.
- 2014-19 వరకు సుమారు రూ.10 కోట్లు మాత్రమే రాయితీ సొమ్ము ఇవ్వగా.. 2019-24 మధ్య కాలంలో రూ.40 కోట్లు చెల్లించారు.
- టీడీపీ హయాంలో బోట్ల డీజిల్ రాయితీ సొమ్ము కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బోట్లకు డీజిల్ వేయించుకునేటప్పుడే సబ్సిడీ సొమ్మును మినహాయింపునిచ్చారు. డీజిల్ రాయితీ రూ.6 నుంచి 9కి పెరగడం, ముందుగానే సబ్సిడీ మినహాయింపునివ్వడంతో మత్స్యకారులకు ఎంతో లబ్ధి చేకూరింది.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు



ఈనెల 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15వ తేదీ అర్ధరాత్రి వరకు చేపలవేట నిషేధం అమలులో ఉంటుంది. ఆ సమయంలో ఎవరైనా చేపలవేట సాగిస్తే పట్టుబడిన చేపలను స్వాధీనం చేసుకుంటాం. మత్స్యశాఖ, కోస్టుగార్డ్, కోస్టల్ సెక్యూరిటీ, పోలీస్, నేవీ, రెవెన్యూ అధికారులతో నిరంతరం గస్తీ ఉంటుంది. నిషేధ సమయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. - ఎం.విజయకృష్ణ, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ

మద్యం కేసుల్లో ఇద్దరి అరెస్టు


పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ రామారావు

నాతవరం: మద్యం అక్రమ రవాణా, సారా తయారీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ రామారావు తెలిపారు. మండలంలో జిల్లేడుపూడి గ్రామానికి చెందిన అల్లు రమణ మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వల్సంపేట పంచాయతీ శివారు తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఈరే జోగారావు అటవీ ప్రాంతంలో సారా తయారు చేసేందుకు బట్టీ ఏర్పాటు చేశాడని, అందిన సమాచారం మేరకు దాడి చేసి, 400 లీటర్లు పులుపు ధ్వంసం చేశామని చెప్పి, జోగారావును అరెస్టు చేసినట్టు చెప్పారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట: మండలంలోని బయ్యవరం-నరసింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే పట్టాల పక్కన 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభించినట్టు తుని రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ లోవరాజు తెలిపారు. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి శరీరంపై నిక్కరు, లేత నాచురంగు టీ షర్టు ఉన్నట్టు చెప్పారు. ఎడమ చేతిపై హిందీ అక్షరాలతో రాము అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. కుడి చేయి మొండి చేయిగా ఉందన్నారు. ఇవి తప్ప ఇక ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. రెండు రోజుల కిందట ప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నట్టు చెప్పారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, వివరాల కోసం తమను గాని, 7674941459 అనే నంబర్‌లో గాని సంప్రదించాలని కోరారు.